కథ

# తిక్కలోడు

**స్వర్ణ**

ఒక్క గెంతులో దాటొద్దనుకున్న పిల్లకాలువ అకస్మాత్తుగా పెద్దవాగంతైపోయి వెక్కిరించినట్లయింది నా పని. నా కొడుకు హైస్కూలులో చేరినప్పటి నుంచీ వాడికి నేను నూరిపోసిందంతా ఖాయిలా పడ్డ పరిశ్రమలో పెట్టిన పెట్టుబడిలా, చవిటి పర్రలో నాటిన విత్తనంలా వృధా అయింది. ఎలాగోలా ఇంటర్మీడియట్ ఫస్ట్‌క్లాస్ అనిపించుకున్నా. ఎంసెట్‌లో కల్లో కూడాపై సీటుకు ఆస్కారం లేని ర్యాంకు తెచ్చుకున్నాడు. చేసేదేముంది. వాడిని డాక్టర్‌ని చేసి అమెరికా పంపాలన్న నా ఆశ నెరవేరడానికి పుట్టినూళ్లో నాకున్న నాలుగెకరాల మాగాణిని అమ్మక తప్పదు. ''పోనీ చైనా వెళ్లి చదువుకుంటావేమిటిరా? చౌకగా అయిపోతుంది'' అంటే పులి గాండ్రింపు విన్న లేడిలా బెదురుతూ ''అమ్మో అంత దూరం వెళ్లను. అమ్మను విడిచి వుండలేను'' అన్నాడు. 'ఛ! వెధవకి బొత్తిగా చొరవేలేదు. రేపు అమెరికాలో ఉద్యోగమెలా చేస్తాడో? తల్లిని విడిచి ఉండలేనన్నే వాడు 'గ్లో'బల ప్రదర్శనలో ఎలా నెగ్గుకొస్తాడు?' నిట్టూర్చాను. పల్లెను విడిచి ఉండలేనన్నే నా బాల్య మిత్రుడు 'తిక్కలోడు' గుర్తుకొచ్చాడు.



***

ఊళ్లో నాకున్న నాలుగెకరాల్ని తిక్కలోడికి కౌలుకిచ్చాను. ''కౌలు పొలం నాకెందుకురా? చేసుకోవడానికి సరిపడా పొలం నాకు వుండనే వుంది. ఇంకెవరికైనా ఇవ్వు. వ్యవసాయం కలిసొస్తే వాళ్లయినా నాలుగు డబ్బులు కళ్లజూస్తారు.'' అన్న తిక్కలోడి మాటల్ని తోసిపుచ్చి వాడిని బలవంత పెట్టి పొలాన్ని వాడికే అప్పగించాను. చూస్తూ చూస్తూ బోర్డు తిప్పే సూచనలున్న బ్యాంకుల్లో ఎవరు డబ్బు దాచుకుంటారు? లీగల్ లిటిగేషన్లు పెట్టి పొలాన్ని తమ పేర దాఖలు పరుచుకునే రైతులు ఎందరు లేరు పల్లెల్లో! మా తిక్కలోడు మహా నిక్కచ్చి మనిషి. అందుకే...బ్లూచిప్ కంపెనీలో షేర్లు కొన్నవాడిలా పదిహేనేళ్లుగా నిశ్చింతగా వున్నాను. ప్రాథమిక వైఫల్యానికి నోచుకోని చోటికి ఫ్యాషన్ ఛానల్ ప్రసారాలు అందుబాటులోకి వచ్చినట్లు-పల్లెలకూ రియల్ ఎస్టేట్ ప్రభంజనం సోకడంతో నా పొలానికి రేటు పదింతలు పెరిగింది. లేకుంటే నా కొడుక్కి ఎంబి బిఎస్ సీటు కొనడానికి జూబ్లీ హిల్స్‌లో వున్న 300 గజాల స్థలం అమ్మక తప్పని దౌర్భాగ్యం పట్టేది. చిన్నప్పుడు మా అమ్మకు నేనెంత అపురూపమో నాకు ఆ స్థలం అంతకన్నా అపురూపం మరి.!

***

తిక్కలోడూ, నేను మా వూరి ప్రాథమిక పాఠశాలలో ఒకటో తరగతి నుంచి టౌన్లోని కాలేజీలో డిగ్రీ వరకూ కలిసి చదువుకున్నాం. వాడు చిన్నప్పటినుంచీ తక్కిన పిల్లలకన్నా చురుకుగా, తెలివిగానే కాదు, తిక్కగా కూడా వుండేవాడు. అందుకే వాడిని చనువు గల వారు ఎదురుగానూ, లేనివారు పరోక్షంగానూ 'తిక్కలోడు' అని పిలిచేవారు. వాళ్ల అమ్మానాన్నా అయినా సరే- తిట్టినా, కొట్టినా సహించేవాడు కాదు. ఓసారి వాడు వీధిలో తోటి వాళ్లతో ఆటలాడుతూ వాళ్ల నాన్నకి కనిపించాడు. దుమ్ము కొట్టుకున్న వాడి బట్టల్ని చూసిన వాళ్ల నాన్న ఒక్కటిచ్చుకున్నాడు. అంతే- తిక్కలోడు అగ్గిరాముడైపోయాడు. 'ఆటలాడుకున్నా తప్పేనా?' అంటూ తండ్రిని కిందపడేలా ఒక్క తోపు తోశాడు.

ఓసారి మా ఊరికి ఓ సాధువు వచ్చాడు. ఊరంతా ఆయనను అపర దైవంగా పూజించింది. ఓ రోజు ఆ సాధువు గాలిలోంచి పటిక బెల్లం తీసి తనను చూడవచ్చిన పిల్లలకు పంచాడు. మేమంతా అబ్బురంతో, ఆనందంతో ఆ ముక్కల్ని తింటుండగా తిక్కలోడు సాధువు దగ్గరకెళ్లి 'ఏమండీ! ఈ పటికబెల్లం ముక్కలో చచ్చిన చీమ వుంది. దేవుడిచ్చిన ప్రసాదంలో కూడా ఇదేమిటి అసయ్యంగా' అని పటికబెల్లం ముక్క తిరిగి ఇచ్చేశాడు.


తిక్కలోడు తరచూ స్కూలు ఎగ్గొట్టినా ప్రతి క్లాసులో ఫస్టొచ్చేవాడు. అది చూస్తే నాకు- మా పెరట్లో శ్రద్ధగా పెంచిన జామ చెట్టు పూతకే నోచుకోకపోగా చుట్టు పెద్ద మొక్కలు అలుముకుపోయినా పక్కింటి జామ చెట్టు విరగకాసినప్పటికీ ఉక్రోషం ముంచుకొచ్చేది. వాడిని చూస్తే కోపమొచ్చేది మరి. ఎప్పుడు బడి ఎగ్గొట్టని నేనెప్పుడూ చదువులో వాడి కన్నా వెనకే వుండాల్సి వచ్చేది.

తిక్కలోడు ఎప్పుడూ బడి ఎగ్గొట్టి చెట్లూ, పుట్టలూ, వాగులూ, వంకలూ పట్టుకుని తిరిగేవాడు. ఎలాంటి చెట్టయినా అవలీలగా ఎక్కేవాడు. వేసవి సెలవుల్లో తోటివాళ్లందరినీ వెంటేసుకొని తాటితోపుకి వెళ్లేవాడు. చకచకా చెట్టెక్కి ముంజకాయలు, సీమ చింతకాయలు కోసి పెట్టేవాడు. ఉప్పూ కారం పొట్లం కట్టుకు వచ్చి వాళ్ల మామిడితోటకి తీసుకుపోయేవాడు. వర్షాకాలమైతే వాడి గురించి నేరేడు చెట్టు మీద వెతుక్కోవలసిందే. ఇక శీతాకాలంలో ఎక్కడెక్కడి తుక్కూపోగు చేసుకొని పెద్ద పెద్ద చలిమంట వేసేవాడు తేగలు తవ్వి తంపట వేసి అందరికీ పంచేవాడు.

ఆటేదైనా వాడున్న జట్టే గెలిచేది. వాడికి చిన్నప్పటి నుంచే చీకటన్నా, శ్మశానమన్నా భయముండేది కాదు. అంతే కాదు- పెద్ద వాళ్లను చూసి కూడా జడిసే వాడు కాదు. ఓసారి రామాలయం అరుగు మీద కూర్చుని వున్న ప్రెసిడెంట్ గారు అటుగా వెళుతున్న తిక్కలోడిని పిలిచి ''గోల్డ్‌ఫ్లేక్ పేకెట్టొకటి పట్టుకురారా'' అని డబ్బులివ్వబోయారు. అంతే తిక్కలోడి ముఖం కోపంతో జేవురించింది. ''కాల్చుకునే వాడివి తెచ్చుకోలేవా'' అంటూ డబ్బులు విసిరికొట్టాడు. అప్పుడు ప్రెసిడెంట్ గారి ముఖం చూడాలి. తిరణాలలో మ్యాంటిల్ మాడిపోయిన పెట్రోమాక్స్ లైట్‌లా అయిపోయింది.

***

హైస్కూలుకు వచ్చే నాటికి వాడి తిక్క రెట్టింపైంది. దేవుడు, దెయ్యం లేవనే వాడు. ''నన్నూ, నిన్నూ, మనుషులందరిని ఆ దేవుడు సృష్టించాడనేది ఉత్త నమ్మకం. కాని ఆ దేవుడిని తయారు చేసి గుడి కట్టించి అందులో పెట్టి, పూజలు చేస్తున్నది మనం. నేను నీతో కలిసి గుడికి వస్తాను. నేను కాదు ఆ బొమ్మే చేతులు జోడించి నాకు మొక్కితే అప్పుడు నమ్ముతాను దేవుడు వున్నాడని!'' అంటూ వెటకారం చేసేవాడు. వాడి మాటలు విని నేను పాపభీతితో చెంపలు వేసుకునేవాడిని. అలాంటి వాడితో స్నేహం చేస్తే నా మీద దేవుడికి కోపం వస్తుందేమోనని భయం వేసేది. కానీ వాడి దగ్గర ఎప్పుడూ డబ్బులు పుష్కలంగా వుండేవి. ముంజకాయలు కోసిపెట్టినంత సునాయాసంగా వాడు స్నేహితుల కోసం డబ్బులూ ఖర్చు పెట్టేవాడు. మరి. వాడికి దూరంగా వుంటే నాకే నష్టం కదా! అడుక్కునే వాళ్లకూ వాడు లెక్కలేకుండా డబ్బులిచ్చేవాడు. పావలాకి బోలెడంత చిరుతిండి వచ్చే రోజుల్లోనే వాడు బిచ్చగాళ్లకు రూపాయలకు రూపాయలు దానం చేసేసేవాడు.




మా తిక్కలోడికి చిన్నప్పటి

నుంచే ఏ సరుకైనా బేరమాడడమంటే అసలు సహించేది కాదు. స్కూలు దగ్గర జామకాయలు అమ్మేవాడు ఎంత చెపితే అంతకే కొనేసేవాడు. ''బేరం అంటేనే కపటత్వం! అమ్మేవాడు వస్తువు విలువను పెంచి చెప్పడం ద్వారా సొమ్ము చేసుకోవాలనీ, కొనేవాడు దాన్ని దించడం ద్వారా సొమ్ము మిగుల్చుకోవాలనీ దోబూచులాడడం ఎంత అసహ్యం! ఇంతకన్నా నిజాయితీగా వుండడం మనుషులకూ అసాధ్యమా? మనసా వాచా కర్మణా ఒకేలా వుండాలనేవాడు.

కాలేజీలో చేరే నాటికి వాడు మరింత ముదిరి పోయాడు. ''ఇది దోపిడీ సమాజం. మనుషుల సుఖదుఃఖాలకు కారణం దేవుడు రాసే తలరాతలు కాదు. దేవుడు లేడు. దేవుడిగా, దెయ్యంగా ద్విపాత్రాభినయం చేసేది అదనపు విలువే. దోపిడీ వ్యవస్థ వల్లనే శ్రమించే వాళ్లు దరిద్రంలో మగ్గిపోతుండగా చుక్క చెమటైనా కార్చని వారు సుఖభోగాలను అనుభవిస్తున్నారు. ఈ వ్యవస్థను మార్చాల్సిందే.'' అంటూ ఆవేశపడే వాడు. కవిత్వం రాసేవాడు. వాడి వాలకం చూస్తే అలాంటి అభిప్రాయాలతోనే తుపాకులు చేతపట్టి అడవులలో సంచరించే వాళ్లతో చేరిపోతాడేమోననిపించేది. అయితే అలా జరగలేదు. ఆ ఉద్యమకారులే ఒకరితో ఒకరు విభేదించి విడిపోయి, ''మీరు విప్లవ ద్రోహులు'' అంటే 'మీరే ద్రోహు'లని దూషించుకుంటూ, చివరకి ఒకరి అంతు ఒకరు చూసుకుంటుంటే తిక్కలోడు హతాశుడయ్యాడు. తాను సూర్యకాంతి అని నమ్మినది కొరివిదెయ్యపు వెలుగు అని తేలినట్టు నిరాశా నిస్పృహలకు లోనయ్యాడు. డిగ్రీ అయ్యాక మా ఊళ్లోనే వ్యవసాయం చేసుకుంటూ ఉండిపోయాడు.

***

తిక్కలోడు వాళ్ల పొలంలో కూలిపనికి వచ్చే యువతినే ప్రేమించి పెళ్లిచేసుకున్నాడు. తల్లిదండ్రులు, బంధువులు కాదన్నా బెదిరించినా ఖాతరుచేయలేదు. 'పెళ్లికి కావలసింది ఇద్దరు ఇష్టపడడం, వాళ్ల బతుకు వాళ్లు బతకగలగడం మా కిద్దరికీ ఒకరంటే ఒకరికి పెళ్లి చేసుకోవాలన్నంత ఇష్టం పెరిగింది. ఇద్దరం కష్టపడి పనిచేయగలం. నాకు ఆస్తి ఇవ్వకపోయినా మా నిర్ణయం మారదు' అన్నాడు. తిక్కలోడు వాళ్ల అమ్మానాన్నకు ఒక్కడే కొడుకు. దాంతో చేసేది లేక వాడి ఇష్టప్రకారమే జరగనిచ్చారు.


ఒకసారి ఊరెళ్లినప్పుడు వాడితో అన్నాను. 'ఈ ఊళ్లోనే పుట్టి పెరిగావు. టౌన్లో చదువుకున్నప్పుడూ ఇక్కడి నుంచే వెళ్లేవాడివి. డిగ్రీలో కాలేజీ ఫస్ట్ వచ్చినా ఈ పల్లెలో వ్యవసాయం చేసుకుంటూ ఉండిపోయావు. చివరికి పెళ్లి కూడా ఈ ఊరమ్మాయినే చేసుకున్నావు. జీవితం బోరనిపించడం లేదా?'

'బోరెందుకనిపిస్తుంది. నాకు ప్రతి సూర్యోదయం, అస్తమయం సరికొత్తగా కనిపిస్తాయి. ఎన్నేళ్లు గడవనీ-వేగుచుక్క వెలుగులో, పొద్దు పొడుపు వేళలో, నీరెండలో, మునిమాపులో,పండువెన్నెల్లో ఈ పల్లె అద్భుతంగా కనిపిస్తుంది! ప్రతి వేకువ జామునా పిట్టల కిలకిలల్లో కొత్త రాగాలు వినిపిస్తాయి. అనంత విశ్వపు ఉనికి ప్రతి రోజూ నన్ను విభ్రాంతుడిని చేస్తూనే వుంటుంది. దాని మూలాన్ని కనుగొనాలన్న పురాతన తపన అనునిత్యం నాలో సరికొత్తగా జ్వలిస్తూనే వుంటుంది. ఏ శిశువును ముద్దు చేసినా నాకో విశ్వాన్ని స్పృశించినట్టే వుంటుంది. మా ఆవిడను తీవ్ర మోహంతో కౌగిలించుకున్న ప్రతీసారి ప్రపంచం కొత్త రుచులతో తొణుకుతున్నట్లుంటుంది. ప్రతి రుతువుకూ ప్రత్యేకమైన రంగులు ఎప్పటికప్పుడు నాకు కనువిందు చేస్తూనే వుంటాయి. ప్రతి తొలకరిలోనూ నేల పువ్వులా మారి వెదజల్లే ప్రాణగంధాన్ని తనివి తీరా ఆఘ్రాణిస్తాను. ఇక ఈ ఊళ్లో మనుషులున్నారు. వాళ్లకు కన్నీళ్లున్నాయి. కిలకిల నవ్వులున్నాయి. వాళ్లకు ప్రేమలున్నాయి. ద్వేషాలున్నాయి. దాదాపు వాళ్లందరితో నాకు ఏదో రకంగా సంబంధం వుంది. ఇక బోరేమిట్రా? నిజం చెప్పాలంటే ఈ ఊరు దాటితే నాకు బోరు కొడుతుంది.''

ఈ కాలంలోనూ పల్లెల్లో బతకడమంటే బాధస్తమో, చేతకానితనమో అనుకునే నాకు తిక్కలోడిచ్చిన పొడుగాటి సమాధానం అంగుళం కూడా జీర్ణం కాలేదు.

***

కొత్తగా కొన్న కారులోనే మా ఊరెళ్లాను. రైల్లో ఫస్ట్‌క్లాసులో వెళ్లిన దానికన్నా గరుడ బస్సులో ప్రయాణించిన దానికన్నా కారులో వెళితే అయ్యే ఖర్చు రెట్టింపు ఎక్కువే. అయినా నాదిప్పుడు



కారులో తిరిగే స్థాయి అని మా ఊరి వాళ్లకు ప్రత్యక్షంగా తెలియాలిగా.

కంకర రోడ్లు కాంక్రీటు రోడ్లయ్యాయి. నా చిన్నప్పుడు చాలా ఇళ్లకు కరెంటే వుండేది కాదు. ఇప్పుడు కనుమ రోజున రథాన్ని సాగనంపేందుకు వేసిన ముగ్గు గీతల్లా ఊరిలో ప్రతి ఇంటినీ కలుపుతూ కేబుల్ వైర్లు. ఊరి జనమంతటికి రచ్చబండగా వుండే విశాలమైన రామాలయం అరుగుల స్థానంలో వరుసగా షాపులు కట్టారు. అవును మరి. రాబడి లేకుంటే రాముడికైనా గడవదు కదా!

ఉదయం 9 గంటలైంది. కారు తిక్కలోడి ఇంటి ముందు ఆపాను. అదే పాతకాలపు పెంకుటిల్లు. కాకపోతే అవసరమైన మరమ్మతులు చేయించినట్టున్నాడు పక్కాగానే కనిపిస్తోంది. ఇంటి చుట్టూ వున్న విశాలమైన జాగాలో బోలెడన్ని పూలమొక్కలు, పళ్ల చెట్లు, పూలమొక్కల దగ్గర ఏదో పని చేస్తున్న తిక్కలోడి భార్య మట్టి చేతులతోనే ఎదురొచ్చి 'రండి..రండి' అంది.

''బాగున్నావామ్మా'' అంటూ పలకరించి అరుగుమీద కుర్చీలో కూర్చున్నాను.

చేతులు కడుక్కుని కాఫీ తెచ్చిచ్చింది.

''వీడున్నాడా?'' అనడిగాను.

''లేరు. ఆదివారం కదా. ఇరుగుపొరుగు పిల్లల్ని వెంటబెట్టుకొని పొలం వెళ్లారు. మీ చేలోని నేరేడు చెట్టు దగ్గరకే. ఆ నేరేడు చెట్టంటే ఆయనకెంతో ఇష్టం. ఊళ్లో మరే నేరేడు చెట్టు పళ్లు అంత రుచిగా వుండవంటారు. వాళ్లమ్మ కూడా. 'ఈ చెట్టు పళ్లకి ఇంత రుచి ఎక్కడి నుంచి వచ్చిందిరా అబ్బాయ్!' అనేవారట. ఆ చెట్టు పళ్లంటే మా అమ్మాయికీ ఇష్టమే. చుట్టుపక్కల పిల్లలకైతే చెప్పనవసరం లేదు. వర్షాకాలం వస్తే చాలు నేరేడుపళ్లకి ఎప్పుడెళదాం అని ఆయన్ని పోరుతుంటారు.''

''చిన్నప్పటి నుంచి వాడి దినచర్య మారలేదన్నమాట'' అంటూ నవ్వి ఇంతకీ పాపేది?'' తిక్కలోడి దంపతులకు ఒక్కతే పాప. టౌన్లో మేము చదివిన కాలేజీలోనే చదువుతోంది.

''అది ఎన్ఎస్ఎస్‌లో చేరింది. ఏదో సర్వీస్ క్యాంప్ వుందట. వారం రోజుల్నించీ టౌన్లోనే వుండిపోయింది.''

''సరే నేనే వాడి దగ్గరకి వెళ్లొస్తాను.''

***

తిక్కలోడికి కౌలుకిచ్చిన నా చేలో పెద్ద అల్లనేరేడు చెట్టుంది. అది నాకు ఊహ తెలిసే నాటికే కాపు పట్టింది. ఏటా విరగకాసే ఆ చెట్టెక్కాలంటే వాడిలాంటి వాడికే సాధ్యం. ఒకసారి నేను ''పది సెంట్ల నేలను ఆక్రమించింది. పంట దండగ. తప్ప ఈ నేరేడు చెట్టెందుకురా. కొట్టించెయ్యి'' అన్నాను. వాడు చిన్నగా నవ్వి 'నీకిచ్చే కౌలులో ఆ పదిసెంట్లకూ మినహాయించనులేరా... చెట్టునలా వుండనిద్దాం' అన్నాడు. నాకున్న పొలంలో ఈ నేరేడుచెట్టున్న ఎకరం కాక మిగిలిన మూడెకరాలు వేరేచోట వున్నాయి.

పుంతలో కారాపాను. పైన మబ్బులు కమ్ముకొస్తున్నాయి. వర్షం వస్తే ఈ పుంత దారిలో కారు ఖరాబవుతుంది. తిక్కలోడిని తీసుకొని తొందరగా ఊళ్లోకి తిరిగి వెళ్లాలి. చేను గట్టున నడుచుకుంటూ నేరేడు చెట్టు దగ్గరకి వెళ్లాను. కింద చాలా మంది పిల్లలున్నారు. కొందరు రాలిన పళ్లను ఏరుకు తింటుంటే కొందరు పైకి చూస్తూ 'అంకుల్! ఆ కొమ్మ మీద బోలెడు పళ్లున్నాయి. అటురా! ఇటురా!' అంటూ కొమ్మల్లో వున్న తిక్కలోడికి సూచిస్తున్నారు. పిల్లల కోడికీ, రెమ్మ రెమ్మకీ గుత్తులు గుత్తులుగా పళ్లు వేలాడుతున్న నేరేడు చెట్టుకీ, ఇప్పటికీ పిల్లల్ని వెంటేసుకుని తిరిగే తిక్కలోడికి తేడా లేదనిపించింది.

''ఏరా! ఎప్పుడొచ్చావు? కాసేపాగు. ఈ కొమ్మ మీద పళ్లు కూడా కోశాక దిగిపోతాను'' చెట్టు మీదనుంచే పలకరించాడు తిక్కలోడు. భుజాన అప్పటికే సగం పైగా నేరేడుపళ్లతో నిండిన సంచిని వేలాడేసుకొని ఇంటరుగు మీద పచార్లు చేస్తున్నంత సులువుగా కొమ్మ మీద తిరుగుతున్న వాడిని చూస్తే 'చిన్నప్పుడు వాడికున్న తెలివితేటలకీ ఎంత ఎత్తు ఎదగాలో! తిక్క కొద్దీ ఇలా చెట్లూ పుట్టలూ పరిమితమైపోయాడు. ప్చ్!' అనిపించింది.

భుజాన నేరేడుపళ్లతో నిండిన బరువైన సంచి వేలాడుతుండగానే అంత చెట్టు అవలీలగా దిగాడు తిక్కలోడు. గుప్పెడు పళ్లు నా చేతిలో పోసి సంచి పిల్లల ముందు పెట్టాడు.


''నువ్వేమీ మారలేదురా! వయసు పెరిగింది తప్ప.అప్పుడూ ఇప్పుడూ అదే టార్జాన్ ఫీట్లు. నువ్వు అథ్లెటిక్ అయ్యుంటే ఎన్నో పతకాలు సాధించేవాడివి. ప్చ్! ఏం చేస్తాం. నీ తిక్క కొద్దీ ఊరికి పరిమితమైపోయావు.'' అంటే నవ్వేశాడు.

''ఇప్పుడు మాత్రం. నేనేమీ సాధించలేదని ఎందుకనుకుంటున్నావ్? చిన్నప్పుడు చేసినట్లే ఈ వయసులోనూ చెట్లెక్కి పళ్లు కోయగలుగుతున్నాను. అప్పుడూ పిల్లలతో కలిసి షికార్లు చేశాను. ఇప్పుడూ వాళ్లతో స్నేహం చేయగలుగుతున్నాను. నా వరకు నాకు ఇది సంతృప్తినిచ్చే సాధనే. నీరు పల్లానికి జారినంత సహజంగా అంటూ... అది సరే గానీ, చాలా కాలం తరువాత వొచ్చావు. నీ సంగతులేంటి చెప్పు''నేరేడుపండు చప్పరిస్తూ అడిగాడు.

''మా వాడిని ఎంబిబిఎస్‌లో చేర్చాలి. నలభై లక్షల వరకూ కావాలి. నా దగ్గర అంత సొమ్ము లేదు. పొలం అమ్మేద్దామనొచ్చాను. ఇప్పుడెలా ఉందిరా రేటు?'' నా మాటకు తిక్కలోడు వెంటనే జవాబివ్వలేదు. నోట్లో వున్నది నేరేడు పండు కాక కుంకుడుకాయ అన్నట్లయింది వాడి ముఖం. వెంటనే నాకు అనుమానమొచ్చింది. 'వీడేదైనా లిటిగేషన్ పెట్టబోడు కదా?'

''రేటు బాగానే వుంది. మీ వాడికి సీటు కొనేందుకు సరిపడా డబ్బొస్తుంది. కానీ, పొలం అమ్మితే గాని పని జరగదా?'' అడిగాడు తిక్కలోడు.

''తప్పదు. నేను సంపాదించిన ఆస్తి రెండు కోట్ల వరకు వుంటుంది గానీ– ఇప్పటికిప్పుడు డబ్బుగా మారిపోదు కదా! అయినా–అమ్మా నాన్నా



పోయారు. మా వాళ్లెవరూ ఈ ఊళ్లో లేరు. ఇల్లె ప్పుడో అమ్మేశాను. ఇంకా నాకో లంకెలా ఈ పొలం ఎందుకురా ఇక్కడ?'' అన్నాను.

తిక్కలోడు నా వంక చూసిన చూపులో నిర సన భావన కనిపించింది. 'నీ ఇష్టం కానీ- ఈ ఎకరం మాత్రం నేను కొనుక్కుంటాను రా' అన్నా డు.

''అంత డబ్బు వీడికెక్కడిది? నాకు తెలు సుండి వాడికి వారసత్వంగా వచ్చిన పదెకరాల పొలంలో రెండెకరాలు పేదలకు ఇళ్లస్థలాలుగా ఊరకనే ఇచ్చేశాడు. ఊళ్లో కూలీనాలీ చేసుకునే వాళ్లకి అవస్థ వచ్చినా, ఆపద వచ్చినా వీడో ఎటిఎం లాంటివాడంటారు. అలాంటోడు ఈ రేట్లలో ఎకరం పొలం ఎలా కొనగలడు? కొంప దీసి నా పొలం చవగ్గా కొట్టేయాలనుకోవడం లేదు కదా?'' ఇంతకు ముందు పిల్లల కోడిలా కని పించిన వాడు చేతిలోని తాయిలాన్ని తన్నుకుపో వడానికి కాచుకున్న కాకిలా కనిపించాడు. నా అవస్థ పసిగట్టినట్లున్నాడు.

''రేయ్! నువ్వేం బెంబేలు పడిపోకు. బయట వాడిచ్చే రేటుకన్నా ఓ రూపాయి ఎక్కువ ఇస్తాను లేరా'' గలగలా నవ్వుతూ అన్నాడు.

పతనమవుతుందనుకున్న షేర్ మార్కెట్ అనూహ్యంగా పదిహేను వేల పాయింట్లు దాటిందన్న సమాచారంలా వాడి మాట నాకు తియ్యగా వినిపించింది. కొంచెం కుదుటపడి అడి గాను. ''నీ కెక్కడిదిరా అంత డబ్బు?''

''నా దగ్గర రూపాయి కూడా లేదు. నువ్వే అప్పు ఇప్పిద్దువుగాని లేరా!' హాస్యమాడాడు.

''కొంప దీసి డబ్బు వాయిదాల పద్ధతిలో చెల్లి స్తాననడుకదా! నా మనసు శంకించింది. జోకు లొద్దు నాకు రెండు వారాల్లో మొత్తం డబ్బు చేతిలో పడాలి తెలిసిందా!'' ఖండితంగా చెప్పే శాను.

***

రిజిస్ట్రేషన్ రోజున ఆ తతంగం ఆలస్యం కావ డంతో ఆ రాత్రికి తిక్కలోడి ఇంట్లోనే వుండిపో యాను. మర్నాటి పొలం పనులకు అవసరమైన కూలీల్ని పురమాయించి వస్తానని వాడు బయట కి వెళ్లాడు. నేను ఉండబట్టలేక వాడి భార్యనడిగా ను.

''ఏమమ్మా! నువ్వు మరోలా అనుకోకపోతే ఓ మాటడుగుతాను. వీడిని చూస్తే ఎప్పుడూ రూపాయి వెనకేసిన వాడనిపించడు. పొలం కొన డానికి డబ్బెక్కడిది? ఈ మాట వాడినే అడిగితే నవ్వేశాడు తప్ప చెప్పలేదు.''

''ఈయన పొలాలు కొనాలి. ఆస్తి పెంచాలి అనుకునే మనిషి కాదని మీకు చెప్పనక్కర్లేదు. 'పంట దండగ తప్ప ఆ నేరేడుచెట్టెందుకు కొట్టె య'మనేవారట కదా మీరు? ఇప్పుడు ఆ చేను మరెవరికైనా అమ్మితే ఆ పనే చేస్తారు. అదాయ నికి ఇష్టం లేదు. 'ఇప్పటికి మూడు తరాల వాళ్ల ఎంతో ఇష్టంగా తిన్న దాని రుచికరమైన పళ్లను మరికొన్ని తరాలైనా తినాలి అన్నారు.'మరి మన దగ్గర డబ్బు లేదు. ఆ చేను కొనడం ఎలా? అని నేనంటే 'మా అమ్మ నగలున్నాయి కదా! అమ్మేద్దాం. వడ్డాణం, కాసులపేరు, మిగతావీ కలిపి నూటయాభై కాసులని ఎప్పుడో మా అమ్మే చెప్పిన గుర్తు' అన్నారు. వాళ్లమ్మ చనిపోయి పధ్నాలుగేళ్లయింది. ఒక్కసారి కూడా ఆ పాతకా లపు చందువా పెట్టె జోలికి పోని ఈయన మొద టిసారిగా దాన్ని తెరిచారు. 'బంగారమంటే వట్టి లోహం. ఎన్ని తరాలు దాచుకున్నా దానికి, దానికి పొదిగినరాళ్లకి పూత పూయడం, పిందె వేయడం, పళ్లనివ్వడం చేతకాదు. ఆ నేరేడు చెట్టు అలాకాదు. ఏటా విరగకాస్తుంది. ఆ పళ్లను తిని ఎందరో తృప్తి పడతారు. నా దృష్టిలో ఈ నగల ధగధగలకన్నా ఆ నేరేడుపళ్ల నిగనిగలే చూడచక్క నైనవి. వీటిని అమ్మి దాన్ని బతకనిస్తే మా అమ్మ నగలకూ సార్థకత వస్తుంది. పరోక్షంగా అవి కూడా పూత పూసి, కాయ కాసి, ఫలించినట్లవు తుంది'' అన్నారు చెప్పింది తిక్కలోడి భార్య.

నగరాల్లో నానాటికీ పెరుగుతున్న స్థలాల రేట్లు సామాన్యులకు కలలో కూడా అందనట్లు వాడిలో పరాకాష్టకు చేరిన తిక్క నాకు అంతుపట్ట లేదు. ప్రపంచంలోని జనమంతా అన్నపానీ యాల కన్నా దేనికి విలువనిస్తారో దేన్ని సొంతం చేసుకోవడానికి ఎంతకైనా సిద్ధపడతారో ఆ బంగారం కన్నా ఎవరూ నాటకుండానే గాలివా టంగా మొలకెత్తి ఎవరూ నీరు పోసి ఎరువు వేసి పెంచకుండానే పైసా ఖర్చు లేకుండానే పెరిగిన నేరేడుచెట్టు ఎక్కువనుకునే వాడు ఎవరికి మాత్రం అర్థమవుతాడు.

*

